# ఆకలి

రామ్మూర్తి ఆ చెట్టు క్రింద అరగంట నించి నుంచున్నాడు. నుంచుని నుంచుని కాళ్ళు పీకాక ఆ చెట్టు మొదటే చతికిల పడ్డాడు. ఆ పెద్ద మర్రిచెట్టు ఇచ్చే నీడ అతని ప్రాణానికి చాలా హాయిగా వుంది. ఇంట్లోకంటే ఇక్కడే హాయిగా వుందనుకున్నాడు. వీలయితే ఆ చెట్టు నీడన ఉత్తరీయం పరుచుకుని కడుపులో కాళ్ళు పెట్టుకు పడుకోవాలనుంది అతనికి. కానీ, ఎవరయినా చూస్తే ? ఇదేమిటి ఇక్కడ పడుకున్నావు ? అని ఆరాలు తీస్తారని భయపడ్డాడు. లేకపోతే ఇల్లు, పెళ్ళాం, పిల్లలు పగైరా మాటలు మరిచి అలా పడుండేవాడు ఆ చెట్టు నీడని ....

అతనికి ఇంటి కెళ్ళాలంటే భయం. .... ఇంటికె ళ్లేంచెయ్యాలి ? ఇక్కడలేనిది ఇంట్లో ఏంవుంది ? అతని ప్రశ్న అది ?

అతను కూర్చున్న చెట్టుకి మూడు నాలుగు గజాల దూరంలో పెద్ద కాంపౌండు వున్న యింటి పెరటిగోడ కనిపిస్తుంది. గోడమీదనుంచి పందిళ్ళు, రాటలు, చాందినీలు, మామిడి తోరణాలు కనిపిస్తూన్నాయి. అంతకి అరగంట క్రితం వరకు బాజా భజంత్రీలు ఫెళ్ళున మ్రోగి ఆగిపోయాయి. పెళ్ళయిపోయిందన్నమాట అనుకున్నాడు రామ్మూర్తి. 'పెళ్ళి' అన్నమాట అనుకోగానే అతనికి ఇంట్లో పెళ్ళికెదిగి కూర్చున్న ఇద్దరు ఆడపిల్లలు. ఎదగ డానికి తయారుగా వున్న మరో ఇద్దరు ఆడపిల్లలు గుర్తువచ్చారు.......... అత నికి గుండెల్లో కలచినట్లయింది .. చప్పున ఆ ఆలోచనలు మరలించ డానికి పెళ్ళివారింటినుంచి వినవస్తున్న మాటల మీదికి దృష్టి మరలించేడు. "విస్తళ్ళు తుడిచి మరీ వడ్డించండి సుమా !" .... "సూరమ్మొదినా! అప్ప డాలు ఇచ్చావూ వేయించడానికి" .... కూరలు, పచ్చళ్ళు అన్నీ వడ్డిం

చండి. పెళ్లివారు వచ్చేశారు. "జారీలలోకి నెయ్యితీశారూ" .... "ఓసేవ్ జానకీ మొగపెళ్ళి వారి ఆకుల దగ్గర అగరొత్తులు వెలిగించండర్రా" .... "ఏవండోయ్ పంతులుగారూ కాస్త చూసి వడ్డించండి...." కలగాపులగంగా ఆడ మగ మాటలు వినపడుతూంటే కుతూహలంగా వి సాగాడు రామ్మూర్తి.

పెళ్ళిపందిట్లోంచి కూరలు, పులుసులు, వాసనలు ఘుమ ఘుమ లాడుతూ ప్రహారీదాటి రామ్మూర్తి నాసికాపుటాలలోకి సోకాయి. రామ్మూర్తి నోట్లోంచి నీళ్ళూరడం మొదలు పెట్టాయి. ఆకలికి దీర్ఘంగా వ్రాలి సోలి పోయిన రామ్మూర్తి పేగులు ఆ వాసనకి లేచి కూర్చుని అవు రావురుమని అరవ సాగాయి.

"నెయ్యి పుచ్చుకోవాలి బాబూ," .... 'ఆ వంకాయ ముద్ద ఇటు రానీయండి.... మరి కాస్త పప్పు వడ్డించ మంటారా, 'గరిట పట్టు కొచ్చి పులుసులో ముక్కలు వేయవయ్యా' .... 'ఇటు బూరెలు వడ్డించనే లేదు. ఇద్దర్నిటు పంపు .......'

వింటున్న రామూర్తికి ఆ వంకాయ ముద్ద రుచి, ఆ గుమ్మడి కాయ పులుసు ఘుమ ఘుమ, బూరెలు, పులిహోర రుచులు గుర్తుకు వస్తూంటే అతని ఆకలి మరింత పెరిగింది. తింటే వంకాయముద్ద, ఆ పులుసు పెళ్ళిం ట్లోనే తినాలి. ఉత్తప్పుడు చస్తే ఆ రుచి రాదుగదా!....

రామ్మూర్తి మనసు 'తాటూర కంతలేదు మెడకో డోలు' అన్న సామెత మరచి పెళ్ళి భోజనం గురించి ఆలోచిస్తూంది. ఆ పెళ్ళివా రింటికి వెళ్ళి భోజనం చేస్తే!? ఇంతమంది తింటున్నారు, అడిగితే ఓ మనిషికి విస్తరేసి పట్టెడన్నం పెట్ట మంటారా?.... కానీ ... ఎలా అడగడం? తను ఏ ముష్టివాడో అయితే జాలితలచైనా అందరూ తినగా మిగిలింది ఇంత పడేస్తారు.... పోనీ పిలకా, అంగోస్త్రం వగైరాలతో వుంటే ఏ బీద

బ్రాహ్మడనో గౌరవం కొద్ది అయినా విస్తరేసి పెడతారు.... తన అవతారం చూస్తే బ్రాహ్మడని ఎవరూ అనుకోరు.... అలా అని ముష్టివాడిలాగా లేడు. వెళ్ళి అడిగితే, 'వెళ్ళవయ్యా... వెళ్ళు, దుక్కలాగ వున్నావు అడుక్కోడానికి సిగ్గులేదూ' అంటారేమో ....

"అయ్యయ్యో .... కుక్క .... కుక్క, కొట్టండి.... పెరటి తలుపులు వేయండి" పెళ్ళి పందిట్లో కేకలు.... లోపల్నించి వస్తున్న భోజన పదార్థాల సువాసనలని ఆఘ్రాణిస్తూ తలుపు సందులోంచి దూరినట్టుంది కుక్క. ఎవరో నడ్డి విరగగొట్టారు. 'కుయ్యో' మంటూ ఇవతలకి వచ్చిపడింది కుక్క. జాలిగా దాని వైపు చూశాడు రామ్మూర్తి.

అక్కడ ఆ కుక్కే కాక మరో అరడజను కుక్కలు చెత్త డబ్బా దగ్గర ఆత్రుతగా ఎంగిలాకుల కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాయి. వాటితో పోటీకి అక్కడ ఓ అరడజను మంది ముష్టివాళ్ళు కూర్చున్నారు.

ఆఖరికి ఓ అరగంట తర్వాత భోజనాలు అయినట్లున్నాయి. "గోవిందా! గోవిందా!" అంటూ కొన్ని గొంతుకలు అన్నాయి.... చేతులు కడుక్కుంటున్న చప్పుడు. కుక్కలు తోకాడించుకుంటూ చెత్తడబ్బాకి మరి కాస్త దగ్గరగా జరిగాయి. మరిపావుగంటకి గోడమీదనించి "దబ్" మని ఎంగిలి విస్తళ్ళు పడ్డాయి... ముష్టి వాళ్ళు కర్రలతో కుక్కల్ని అదిలిస్తూ పరిగెత్తి ఎవ్వారికందినన్ని ఎంగిలాకులు వాళ్ళు జాగ్రత్తపరుచుకున్నారు. వాటిల్లోంచి అన్నం కూరలు, బూరెలు అన్నీ తీసి విడి విడిగా ఓ ఆకులో పెట్టుకుంటున్నారు.... "ఇవి మా ఆస్తి, మీకేం హక్కులేదు" అన్నట్టు గుర్రుమంటూ కోపంగా చూస్తూ, నిస్సహాయంగా అరుస్తున్నాయి కుక్కలు.

రామ్మూర్తి వింతగా చూస్తున్నాడు ఆ ముష్టి వాళ్ళని ........వాళ్ళు మహదానందంగా, ఆబగా, విందుభోజనం తింటున్నంత ప్రీతిగా ఆ ఎంగిలాకులలోనివి తీసుకుని తింటున్నారు. వాళ్లు తింటూంటే రామ్మూర్తి ఆకలి

మరింత పెరిగింది.... తిండిలేక చస్తున్నా తను యిలాంటి పని చేయగలడా?

గోడమీదనించి విసిరిన విసురుకి విస్తర్లోంచి ఓ మిఠావుండ దొర్లి రామ్మూర్తి కాళ్ళదగ్గిర పడింది. దానిమీద పడింది రామ్మూర్తి దృష్టి. శీగ్గా, సుతారంగా చిన్నముక్క-మాత్రం కొరికి వదలిన వుండవైపు ఆశగా చూశాడు రామ్మూర్తి. అది చూస్తుంటే అది తీసుకు తినాలన్న కోరికని నిగ్రహించుకోలేక పోతున్నాడు...... అమట్టి దులిపేసి తింటే ...? ఎంగిలయితేనేం ఆ కాస్త మేరా వదిలేస్తే సరి... లేకపోతే ఆ పైపు దగ్గరికి తీసికెళ్ళి కాస్త కడిగేసి తింటే......పేగులుకాస్త చల్లబడతాయి.... "బొత్తిగా అంత హీనానికి దిగజారుతావా" అని మనసు నిలేసింది. ఎవరన్నాచూస్తే ........రామ్మూర్తి సందేహిస్తూ ఆలోచించే లోపలే ఓ కుక్క ఆ వుండని చూడనే చూసింది. ఒక్క ఉరుకునవచ్చి నోట కరుచుకుని పారిపోయింది. రామ్మూర్తికి ఉక్రోషం ముంచుకువచ్చి పెద్దరాయి తీసి కుక్కని కొట్టాడు.

ఆ ముష్టివాళ్ళు తినడం ముగియగానే మరో అరడజను మంది ముష్టివాళ్ళు క్రొత్త బ్యాచి విస్తళ్ళ కోసం వచ్చారు. అలా చూస్తూ కూర్చుంటే ఆకలికి వాళ్ళతో పాటు తనూ జతయి పోతానన్న భయంతో.... వాళ్ళు తింటూంటే చూసి ఆకలి భరించలేక, అక్కడనించి కదిలాడు రామ్మూర్తి.

నాలుగడుగులు వేసేసరికి... ఓ ముసలమ్మగారు ఎడా పెడా సంచులు మోస్తూ నడవలేక నడుస్తూంది. రామ్మూర్తిని చూసి ఆగి, కొస్త సందేహిస్తూనే "చూడు నాయనా .... కాస్త ఈ సంచులు యింటిదాకా తెచ్చిపెడతావూ... ... పావలా ఇస్తాలే... వాడి దుంపతెగ ఆ రిక్షా చచ్చినాడు రూపాయి పావలా కావాలన్నాడు ...... ఎంతో దూరం లేదులే... ఆ రెండో వీధేలే" అంది.

రామ్మూర్తి గతుక్కు మన్నాడు. తను కూలి వాడిలా కనిపిస్తున్నాడా?

కనిపించాదేమో! మాసినపంచె, చిరిగినషర్టు, రెండు నెలలుగా క్షవరానికి నోచుకోని జుట్టు, మాసిన గడ్డం, తన అవతారం చూసి ఆవిడ అనుకుంటే ఆవిడిదా తప్పు!

"నేను కూలివాడిని కానండీ...." అన్నాడు సగం చచ్చి!

"అలాగా.. తెలియక అడిగాను ఏమనుకోకు బాబూ" అందావిడ.

పోనీ సంచులు తీసికెడితే, ఓ పావలా ఇస్తుంది....దాంతో అరడజను అరటిపళ్ళన్నా కొనుక్కు-తిని ఇన్ని నీళ్ళు తాగచ్చు అనిపించింది ఓ క్షణం రామ్మూర్తి. ఛా... ఛా... ఎవరన్నా చూస్తే... పరువేంగాను....అను కున్నాడు మళ్ళీ

మరో నాలుగు అడుగులు నడిచాక, రెండు రోజులుగా తిండిలేని అతని శరీరంలో అవయవాలు ముందుకు కదలమని మొరాయిస్తుంటే తన మీద తనకే పట్టలేని కోపం వచ్చింది. వెధవ భేషజానికి-పోయి ఆ పావలా కూడా పోగొట్టు కున్నాడు. రోజుకి రెండు, మూడు రూపాయలు సంపా దించే కూలివాడి కంటే తనెందులో మెరుగు? వాడికి కక్కు-రలేని పరువు, మర్యాద కోసం తనెందుకు ప్రాకులాడాలి? ఆ ముష్టివాళ్ళలా కుక్కలతో సమానంగా కలియబడి దొరికిందేదో తిని బ్రతగ్గలిగే తెగువా, ధైర్యమూ లేవు. ఇటు మూటలు మోసో, తట్టలుదించో నాలుగు డబ్బులు తెచ్చుకోలేని తనలాంటి బ్రతుకులకి మోక్షంలేదు! "నీ కెందుకయ్యా, ఇంత కసి మా మీద, ఎందుకింత ద్వేషం, మా బ్రతుకులు యిలా త్రిశంకు స్వర్గంలో ఎందుకు పడేశావు" అని కసిదీరా మరోసారి ఆ దేవుడ్ని శపించు కున్నాడు మనసులో రామ్మూర్తి! కాళ్ళీడ్చుకుంటూ ఓ గమ్యంలేకుండా ఆ ఎండలో పడి రామ్మూర్తి నడుస్తున్నాడు.... ఇంటికెడితే పిల్లల ఆకలి మొహాలుచూసి, పెళ్ళాం తిట్లూ శాపనార్థాలు విని రెండూ సహించలేడు.... ఇవాళ కొట్టుకు శలవయింది.... లేకపోతే ఆ కొట్లోనే పడుండేవాడిని అనుకున్నాడు....

రామ్మూర్తి పూర్వాశ్రమంలో ఎన్. జి. వో. ఎల్. డి. క్లర్కుగా జాయిన్ అయి హెడ్ గుమస్తాగా రిటైరయ్యాడు! .... రిటైరు అవలేదు! రిటైరు చేయబడ్డాడు. మరో ఏడాదికి రిటైరవుతాడనగా ఏవో కాగితాలు మాయంచేశాడని తప్పుడు లెక్కలు రాశాడని, లంచం తీసుకున్నాడని.... ఏవేవో నేరారోపణలుచేసి సస్పెన్షన్‌లో పెట్టబడ్డాడు. ఓ రెండేళ్ళు అర్థ జీతం తీసుకుంటూ కోర్టులంట తిరిగాక నేరాలు రుజువుచేసి డిస్మిస్ చేయడమే కాక పెన్షన్ రద్దుచేస్తు శిక్ష విధించారు.

పాపం రామూర్తి వేలు, లక్షలు ఏం తినలేదు. ఓ పది, పాతికకి మహా అయితే వందకి కక్కుర్తి పడ్డాడు. పడ్డానంటే రామ్మూర్తి తన తప్పేం లేదంటాడు. ఎదుగు బొదుగు లేని జీతం, ఎద కపోయినా రోజురోజుకి ఎదిగిపోతున్న సంసారంతోపాటు ధరలు .... ఏంచేస్తాం అంటాడు. పై వాళ్ళందరూ తినగాలేనిది తను తినడం తప్పా అనుకున్నాడు అప్పుడు! కానీ పాపం అప్పుడు ఆ తినడం యింత ముప్పు తెస్తుందని అనుకోలేదు రామ్మూర్తి. తీరా ముప్పువచ్చాక ముప్పొద్దులా కాళ్ళరిగేలా తిరిగి పెద్దల కాళ్లు పట్టుకున్నాడు! పెద్దలు కాళ్ళేకాక చేతులూ విదిలించేసుకుని "పో.... పో.... యింకా నయం జైలు కెళ్ళనందుకు సంతోషించు, దయతల్చి యింతటితో వదిలేశా?" మని తమ దయార్ద్రి హృదయాలని వెల్లడించుకున్నారు.

రామ్మూర్తి నిస్సహాయుడై కసితో అధికారులని, కోర్టులని, న్యాయమూర్తులను మనసులో మాత్రం శపించుకోగలిగాడు.... "అయ్యలారా, వేలు, లక్షలు తినేవారిని వదిలి నాలాంటి పదులు ఇరవైల వాళ్ళని మాత్రం శిక్షించడం ఏంధర్మం!.... న్యాయమూర్తులారా మీరే శెలవీయండి' అని ఎలుగెత్తి అరవా లనుకున్నాడు. కాని ఏదీ నిరూపించలేని తనలాంటి వాడిమాట నమ్మేదెవరని నోరు మూసుకున్నాడు. ఇంకా మాట్లాడితే

జైల్లోకి తోస్తారేమో నని భయపడి నోరు మెదపలేదు.

అప్పటినించి పొట్టకూటికి రామ్మూర్తి పడని పాట్లు లేవు. సస్పెన్డ్ అయిన ఏభై ఐయిదేళ్ళ రామ్మూర్తికి ఉద్యోగం దొరకడం అంటే మాటలు గాదు। ఏ ప్రయివేట్లో చెప్పు కుందామన్నా... చదువు చెప్పకుండానే ప్యాసు చేయించే నేర్పువుండే స్కూలు మేష్టర్లని కాదని రామ్మూర్తిలాంటి వాడి దగ్గర ప్రయివేట్లు యీ రోజుల్లో ఎవరిక కావాలి ?

ఆఖరికి ఆర్నెల్లు తిరిగాక, తప్పుడు లెక్కలు కరక్టుగా కనిపించేట్టు రాయగలిగిన నేర్పు వున్న రామ్మూర్తిని తప్పుడు లెక్కలు కరక్టుగా కనపడేటట్టు రాయడాని. ఓ బట్టలకొట్టు యజమాని అరవై రూపాయలకి కుదుర్చుకున్నాడు.

రామ్మూర్తి పెద్ద కొడుకు మరో వూళ్ళో గుమస్తా రక్తం పిండి పంపుతున్నట్టు బాధపడ్తూ తప్పక నూట ఏభై లోంచి ఓ ఏభై యింటికి పంపుతాడు. మిగతాదాంతో పెళ్ళాం, యిద్దరు పిల్లల్ని పోషించుకోలేక, చావ లేక, బ్రతకలేక బ్రతుకుతున్నాడు.

తాతలనాడు కట్టించిన మూడు గదుల కొంపలో ఓ గది అద్దెకిచ్చి ఒకటిన్నర గదిలో కాలక్షేపం చేస్తున్నాడు రామ్మూర్తి. ఆ అరవై, కొడుకు పంపే ఏభై యింటద్దె పాతికతో రామ్మూర్తి ఇంట్లో ఎనమండుగురికి నెలకి సగం రోజులు మాత్రం రెండు పూటలా నోట్లోకి వేళ్ళు వెడతాయి। ఆ మిగతాలో సగం రోజులు ఒక పూట మాత్రం లోపలికి వేళ్ళు వెడతాయి. ఆఖరివారం అసలు నోట్లోకి వేళ్ళు వెళ్ళవు. అమ్మదగినవి, కుదువ పెట్ట తగినవి అన్నీ రామ్మూర్తి నిరుద్యోగపర్వంలో వుండగానే హరించి పోయాయి, ప్రస్తుతం సిల్వర్ బొచ్చెలు, మట్టి కుండలు, చింకి చాపలు, చిళ్ళు బొంతలు.... అస్థి పంజరంలాంటి భార్య, చదువులేక పెళ్ళికాక

గుండెల మీద కుంపటిలా పెళ్ళి కెగిగి కూర్చున్న పాతికేళ్ళ ఆడపిల్లలు యిద్దరూ మేము రెయారే అంటూ బెదిరిస్తున్న పధ్నాలు గేళ్ళ పన్నెండేళ్ళ ఆడపిల్ల లిద్దరు, పదేళ్ళ కొడుకు .... యివీ రామ్మూర్తి యింట్లో కనిపించే సజీవ, నిర్జీవ వస్తువుల జాబితా.

ప్రస్తుతం రామ్మూర్తికి నెలలో ఆఖరివారం—
నోట్లోకి వేళ్ళు వెళ్ళని రోజులు! నిన్న ప్రొద్దుట పెళ్ళాం ఎవరింటినించో బదులు తెచ్చిన రెండు గొట్టాల బియ్యం అందరూ కలసి ఇంత జావలా కాచుకు త్రాగడానికి సరిపోయాయి.. నిన్న ఉదయం త్రాగిన ఆ జావ అరిగిపోయి పాతిక గంటలే అయినా పాతిక రోజులుగా అనిపిస్తూంది రామ్మూర్తికి.

రాత్రి ఏడున్నర వరకు త్రిపాధి నక్షత్రంలా తిరిగి .... కనపడిన చోటల్లా పైపు నీళ్ళతో పొట్ట నింపుకుంటూ, చీకటిపడ్డాక .... తప్పదన్నట్టు ఇంట్లోకి అడుగు పెట్టాడు భయపడ్తూ, భయపడ్తూ.

ముందు గదిలో చాపమీద గోడవైపు తిరిగి భార్య పడుకుంది. మరో ప్రక్క బొంతమీద వారం రోజులనించి జ్వరంతో పడున్న ఆఖరి కొడుకు పడుకున్నాడు. ఎక్కడినించో చిరిగిపోయి శిథిలావస్థలోవున్న పాత పత్రికలని తెచ్చుకుని తలొక మూలా ముగ్గురు కూతుళ్ళు కూర్చుని శ్రద్ధగా ఆసక్తిగా చదువుతున్నారు. తండ్రి రాగానే బితుకు బితుకుమంటూ చూశారు కూతుళ్లు. ఇంట్లో శ్మశాననిశ్శబ్దం చూసి కాస్త భయపడ్డాడు రామ్మూర్తి. ఒక్క క్షణం అలా నిలబడి పెళ్ళాం ఎక్కడ లేస్తుందోనని పిల్లిలా అడుగు లేస్తూ నూతి దగ్గిర కాళ్ళు చేతులు కడుక్కుని పెరటి అరుగుమీదే కూర్చున్నాడు.

పదినిమిషాలు గడిచాక "నాన్నా.... అన్నానికి రా" అంది మూడో కూతురు వచ్చి రామ్మూర్తి మనసు సంతోషంతో ఊగిపోయింది. గంజి

నీళ్ళే గతిలేదనుకున్నవాడికి మృష్టాన్నం దొరికితే కలిగే ఆనందంలాంటిది ఆ సంతోషం. పెళ్ళాం ఎక్కడో తెచ్చి వండిందన్న మాట! "అన్నం పెడ్తారా తల్లీ!" అంటూ గబగబ వంటింట్లోకి వెళ్ళాడు రామ్మూర్తి.

విస్తట్లో అన్నం, యింత పచ్చడో చారో వుంటుం దనుకున రామ్మూర్తికి ఎదురుగా వంకాయ కొత్తిమిర కారం, కూర, కొబ్బరిపచ్చడి, చారు అన్నీ చూచేసరికి ఇవన్నీ ఎక్కడి వన్న ప్రశ్నే పుట్టనీయకుండా ఆబగా, గబగబ అన్నం తినడం మొదలుపెట్టాడు ... సగం తిన్నాక ఆత్మారాముడు కొంత చల్లబడ్డాక....

"అమ్మ పడుకుందేం అమ్మా?" అనడిగాడు మజ్జిగ పోస్తున్న కూతుర్ని నెమ్మదిగా. మధ్యాహ్నంనించి అమ్మ అలా ఏడుస్తూ పడుకుంది నాన్నా ..." అంది రహస్యం చెప్తున్నట్లు కూతురు.

"ఎందు కెందుకు?" ఆందోళనగా అడిగాడు. పిల్లలు ఆకలికి ఏడ్తే చాతకాక వాళ్ళని రెండు బాది, తనని రెండు బాదుకుని ఏడుస్తుందేమో అనుకోడానికి సుష్టుగా భోజనం వుండగా ఏడుపెందుకో రామ్మూర్తికి అర్థం కాలేదు.

"మధ్యాహ్నం పెద్దక్కని అమ్మ చీపురుతో కొట్టింది. నాన్నా.... అప్పటినించి అలా ఏడుస్తూ పడుకుంది." గుసగుసలాడింది కూతురు.

"అక్కని కొట్టిందా? ఎందుకు?" అయోమయంగా అడిగాడు రామ్మూర్తి.

కూతురు తలవంచుకుని జవాబీయలేదు. రామ్మూర్తికేం తట్టలేదు.

"ఏం చేసిం దది. ఎందుకు కొట్టింది!" నెమ్మదిగా అడిగాడు.

"ఏమో నాన్నా...అక్క ఎక్కడికో వెళ్ళి డబ్బు తెచ్చింది. అందుకు ...." బితుకు బితుకు చూస్తూ తల్లి వింటుందని నెమ్మదిగా అందికూతురు.

"డబ్బు తెస్తే కొట్టిందా? ఎక్కడనుంచి తెచ్చింది? ఎవరింటి నుంచి?"

కూతురు మరీ తలదించుకుంది. మరి కాస్త గొంతు తగ్గించి రహస్యం చెపుతున్నట్టుగా "మన ఎదురింట్లో స్టూడెంటు లేడూ.... అతని గదికి వెళ్ళింది.... చాలా సేపుంది...."

"అక్కడనించి ముప్ఫై రూపాయలు తెచ్చింది.... అందుకు కొట్టింది అమ్మ..."

రామ్మూర్తి చేతులో ముద్ద జారిపోయింది.... తెల్లపోతూ చూశాడు. సంభ్రమాశ్చర్యాదలతో "అక్కడికెళ్ళిందా!.... డబ్బు తెచ్చిందా!" తడబడ్తూ అన్నాడు.

"ఊఁ... అక్క వెళ్ళడం అమ్మ చూడలేదు.... అతని గదిలోంచి వస్తూంటే చూసింది. డబ్బియగానే పట్టుకు చితక్కొట్టేసింది...."

రామ్మూర్తికి కథ అర్థం అయింది. అతని చెయ్యి అన్నంతో వణక సాగింది, "ఈ బియ్యం ... అవి ఆ డబ్బుతోనే కొన్నారా."

"ఆ.... అమ్మ విసిరేసిన ఆ నోట్లు చిన్నక్క తీసి దాచింది. అదే బజారు కెళ్ళి సామానుతెచ్చి వంట చేసింది...."

"అమ్మ వూరుకుందా?"....

ఆ పిల్ల దోషిలా తలవంచుకుంది.... "అమ్మ తిట్టింది నాన్నా.... తినండర్రా నిర్భాగ్యపు వెధవల్లారా.... ఆ దరిద్రపు తిండి కడుపులు పగిలేలా తింటున్నార్రా, సిగ్గులేకుండా .... దౌర్భాగ్యపు వెధవల్లారా ఆ తిండి తినకపోతే చస్తారా ... అంటూ, అరిచి మమ్మల్ని తిట్టి, తల బాదుకుంటూ ఏడుస్తూ పడుకుంది."....

"అక్కేది?"

"పెరట్లో ఆ ప్రక్క అరుగు మీద కూర్చుంది ఏడుస్తూ.... ఇంట్లోకి రమ్మంటే రావడంలేదు.... అన్నంకూడా తినలేదు.... అదేమిటి మజ్జిగ అన్నం తినవా నాన్నా"

"వద్దమ్మా.... కడుపు నిండిపోయింది.... చాలింక" రామ్మూర్తి విస్తరి ముందునుంచి లేచిపోయి చేయి కడిగేసుకున్నాడు.

పెరట్లోకి నాలుగడుగులువేసి ఆగిపోయాడు రామ్మూర్తి.... అటు వెళ్ళి కూతురి మొహం చూడాలంటే సిగ్గనిపించింది.... లోపలికెళ్ళి పెళ్ళానికి మొహంచూపలేక వీధిలోకి వెళ్ళిపోయి నిలబడ్డాడు. అతని గుండెల్లో పెద్ద బండరాయి పడేసినట్లు, గొంతులో పెద్ద మంచుముద్ద అడ్డుపడినట్లు, ఊపిరి ఆడనట్లు అనిపించసాగింది. ఏం చెయ్యాలో తోచనిస్థితి అది.

రామ్మూర్తి వీధిలో నిలబడడంచూసి పక్కింటి అవధానిగారు గుమ్మం దిగి రామ్మూర్తి దగ్గరకు వచ్చాడు. ఓసారి రామ్మూర్తిని ఎగాదిగా చూసి గొంతు సవరించుకుని "చూడు రామ్మూర్తి.... మాట...." అంటూ మరి కాస్త దగ్గిరకు జరిగాడు "ఇదిగోచూడు, నేను నీకంటే పెద్దవాడిన్ని, నేనో మాట అంటే ఏమనుకోకు.... అది సరేగాని, నీ కసలు ఇంట్లో ఏం జరుగుతూందో తెలుస్తుందా ....అహాఁ తెలుస్తుందా.... అని.... తెలిసే వూరుకుంటున్నావా ?... అవ్వ... బ్రాహ్మణ పుట్టుక పుట్టిన మన యింటా వంటా ఇలాంటి పనులు జరగడం కని విని ఎరుగుదుమా ? ..."

రామ్మూర్తి గుడ్లప్పగించి చూడటం మొదలు పెట్టాడు.... "ఇవాళ మధ్యాహ్నం నీ పెద్ద కూతురు ఎదురింటి స్టూడెంటు గదిలోంచి వస్తూంటే యీ వీధిలో నాలుగై దిళ్ళవాళ్ళు చూశారట.... ఇదేమిటయ్యా.... పెళ్ళికాని పిల్ల.... యింతకీ తెగిస్తుందా.... ఇంక నీ పిల్లలకేం పెళ్ళిళ్ళవుతాయి.... ఆ మాత్రం పిల్లల్ని అదుపులో పెట్టుకోలేక యిలా వదిలేస్తారుటయ్యా....నీ

పరువు ప్రతిష్ఠ గంగలో కలిపేసుకున్నావా ? తిండి లేకపోతే చావాలి గాని యిలాంటి పనులటయ్యా చేస్తారు.... కలికాలం.... నీ వెలా యింకా బ్రతుకు తిరుగుతున్నావో కానీ, నే నయితే యీపాటికి తల పగలగొట్టుకుని చచ్చే వాడిని...."

రామ్మూర్తికి పౌరుషం వచ్చేసింది. అసలే చికాకుగా వున్న అతనికి తన చేతకానితనాన్ని వేలెత్తి చూపుతుంటే వెర్రి ఆవేశం వచ్చేసి ఊగిపోయాడు. "అయ్యా అవధానిగారూ, తమరి నీతి పన్నాలు వినేందుకు నాకు ఓపిక లేదు. వెళ్ళండింక .... నా ఖర్మానికి నన్ను వదిలిపోండి. మీ కెందుకయ్యా మా యింటి గొడవ.... ఇన్ని పెద్దకబుర్లు చెప్పే మీరు తిండిలేక మాడుతున్నా ఓ పూట శేరు బియ్యమన్నా ఇచ్చారా? ఒక్క రూపాయైనా అప్పిచ్చారా.... మా కష్టం అర్చి, తీర్చలేని మీకు మా గొడవెందుకు.... నా యిష్టం.... ముష్టెత్తుతాను.... మూటలు మోస్తాను .. నా కూతుర్లని బజార్లో పెట్టి సంపాయిస్తాను.... ఏంచేస్తే మీ కేం బాధ....వెళ్ళండి.... పరువు, ప్రతిష్ఠలు అన్నీ వున్నవాడికి, నాలాంటి వారికి కాదు ....పిచ్చివాడిలా గొంతు చించుకుని అరవసాగాడు రామ్మూర్తి.

'రామ్మూర్తి! ' అవధానిగారు కలవరపడ్తూ "మతిపోయిందా, ఎమిటా కేకలు.... జరిగింది చాలక .... ఇంకా నలుగురూ వినాలా...." అంటూ వారించాడు.

"ఆ....ఆఁ ఊరు వాడ చాటుతాను....నా యిష్టం వచ్చినట్లు చేస్తాను. అడిగేవా డెవడో చూస్తాను...." ఊగిపోయాడు ఆవేశంతో రామ్మూర్తి.

అప్పటికే గుమ్మంలో నించుని ఆడవాళ్ళు, గుమ్మాలు దిగి మగవాళ్ళు చోద్యంచూడటం ఆరంభించారు. రామ్మూర్తి చిన్నకూతురు పరిగెత్తుకువచ్చి 'నాన్నా.... అమ్మ లోపలికి రమ్మంటూంది' అంటూ లాక్కెళ్ళింది లోపలికి.

"నా యిష్టం నా యిష్టం వచ్చినట్లు చేస్తాను... అదేమన్న వాళ్ళని పాతేస్తాను... నా వూసుకి వచ్చిన వాళ్ళమీద ఉమ్మేస్తాను...." లోపలికి వెళ్ళేవరకు అంటూనే వున్నాడు.

ఇంట్లోకి రాగానే భార్యని చూసేసరికి రామ్మూర్తి నోరు దానంతటదే మూతపడింది. ఆమె చింతనిప్పులాంటి కళ్ళతో, విరబోసిన జుట్టుతో ఊగిపోతోంది. ఆవిడ చూపులకే శక్తివుంటే రామ్మూర్తి అక్కడికక్కడే మాడి మసి అయిపోయే వాడు. మొగుడ్ని చూసి ఆవిడ దబదబ తల మొత్తేసుకుంది. "భగవంతుడా!... ఎన్ని నోములు, ఎన్ని పూజలు చేసుకుంటేనో ఇలాంటి మొగుడు, ఈ పిల్లలు. ఎంత పాపం చేసుకున్నానో... మహాప్రభో నన్నెందుకు తీసికెళ్ళవు ఇంకా.... అంటూ గొల్లున ఏడ్చింది. గోడకేసి తలబాదుకుంది. రామ్మూర్తి బిక్కచచ్చిపోయి, వెర్రివాడిలా చూస్తూ నిల్చున్నాడు. అప్పటికి గానీ తను చేసిందేమిటో తెలిసి రాలేదు. సిగ్గుపడిపోయాడు. "అమ్మా అమ్మా" అంటూ ఇద్దరు కూతుర్లు గోడకేసి తలబాదుకుంటున్న తల్లిని వెనక్కిలాగారు. ఆవిడ భోరుమని ఏడుస్తూ మళ్ళీ ఆ దాపుమీదే పడింది.

రామ్మూర్తి మాడిపోయిన మొహంతో నెమ్మదిగా పెరట్లోకి వెళ్ళాడు. అక్కడ పది నిమిషాలు తచ్చాడి, ఆఖరికి కూతురు కూర్చున్న అరుగు దగ్గరకెళ్ళి నిలబడ్డాడు. ఏడుస్తున్న కూతురు అలికిడికి తలెత్తి చూసింది. ఆ గుడ్డి వెన్నెలలోనే కూతురి మొహం చూసి చలించిపోయాడు రామ్మూర్తి. ఆ కళ్ళ భయం, బెదురు, దీనత్వం, పాపభీతి చూసి అతని మనసు ద్రవించింది.

"అమ్మా లక్ష్మీ..." అన్నాడు కరిగిపోయి.

"నాన్నా!" అంటూ బావురుమంది లక్ష్మి. ఆశించని ఆదరణ కన్పించగానే.. తండ్రి చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడవడం

మొదలు పెట్టింది.

"ఊరుకో అమ్మా.... ఊరుకో!" కంఠం పూడుకుపోగా ఎలాగో అన్నాడు.

"నాన్నా ... నాన్నా...." ఏదో చెప్పాలని ఆరాటపడ్తూ ఎలా చెప్పాలో తెలియక కొట్టుకుంటూంది లక్ష్మి.

ఆ బాధ రామ్మూర్తికి అర్థం అయింది. "ఊరుకో అమ్మా... ఏడవకు.... లే.... లేచి ఇంట్లోకి పద...." తండ్రినించి యింత ఆదరణ సానుభూతి లభిస్తుందని ఎదురుచూడని కూతురు దుఃఖం మరింత పెరిగింది. అంతా చెప్పుకుంటేగాని బాధ తగ్గదనిపించింది.

"నాన్నా.... నేను చెయ్యాలని ఆ పని చెయ్యలేదు నాన్నా ..."

"సరే....జరిగింది జరిగింది. ఇంక బాధపడి ఏం ప్రయోజనం...."

"కాదు నాన్నా చెప్పనీ నన్ను.... మూడు రోజులుగా ఎవరికి భోజనంలేదు నిన్న ప్రొద్దుట త్రాగిన గుక్కెడు జావ తప్ప.... ఇవాళ అదీ లేదు.... అమ్మ కసలు ఓపికలేదు, సరిగా భోంచేసి ఎన్నాళ్ళయిందో, శోష వచ్చినట్లు లేవలేక పడుకుండిపోయింది. చెల్లెళ్ళు పాపం అలా ఆకలికి నీర్సంగా వ్రాలిపోయారు... తమ్ముడు.... వాడికి పాపం వారంనించి జ్వరమా.... ఇవాళ కాస్త తగ్గి... ఆకలే అని గోలపెట్టాడు. ఇన్ని కాఫీ నీళ్ళయినా వాడికి యియడానికి డబ్బులు లేకపోయాయి.... పాపం ఆఖరికి ఓ బత్తాయి పండో, రెండు బిస్కట్లన్నా పెట్టమని గోలపెడుతూ ఏడ్చాడు. ఎవరిని అడిగినా ఓ అర్థ రూపాయన్నా యియలేదు. వాడేడుస్తూంటె అమ్మ ఏడుస్తూ కూర్చుంది. వాడు మొండిపట్టు పట్టి ఏదన్నా పెట్టమని ఏడుస్తూంటే అమ్మ చాతకాక వాడిని రెండుబాది, తన నెత్తి బాదుకుంది ...నేను చూడలేక పోయాను నాన్నా.... ఎవరూ అప్పియలేదని, ఆఖరికి పోనీ ఆ

ఎదురింటి స్టూడెంటు నడిగాను. ఓ ఐదో పదో బ్రతిమిలాడి తెద్దామని వెళ్ళాను నాన్నా.... అంతే నాన్నా, నిజంగా అందుకే వెళ్ళాను.... కాని అతను డబ్బు పూరికే యీయనన్నాడు.... ముప్పై రూపాయలు చూపించి ఆశపెట్టాడు ... ఆ డబ్బు చూస్తే నా కప్పు డేం తెలియలేదు.... ముప్పై రూపాయలతో.... ఎన్ని కొనవచ్చునన్న ఆలోచన తప్ప మరోటి రాలేదు. ఓ వారం కడుపునిండా తిండివుంటుందని ఆశపడ్డాను.... ఏడుస్తున్న తమ్ముడికి పళ్ళు బిస్కట్లు అవి కొనవచ్చని పొంగిపోయేను.... అంతే తప్ప నే చేసేది తప్పన్న ఆలోచన రాలేదు.... చెప్పు నాన్నా.... నే చేసేది తప్పా?.... ఆకలితో చచ్చిపోతుంటే చూడలేక నే చేసిన పని తప్పా? అమ్మ తిట్టింది.... కొట్టింది.... ఇరుగు పొరుగు నానా మాట లన్నారు.... నే నేం చెయ్యను నాన్నా....

రామ్మూర్తి నిరుత్తరు డయ్యాడు.... కూతురు తల నిమురుతూ కళ్ళంట నీళ్ళు పెట్టుకుంటూ వుండిపోయాడు....కూతురు హృదయ విదారకంగా ఏడుస్తూ "చెప్పునాన్నా.... నీవేనా చెప్పు నాన్నా.. నే చేసింది తప్పు కాదని నీవైనా అను నాన్నా!" అంటూంది.

"లేదమ్మా లేదు....నీ తప్పేంలేదు తల్లీ.... పరిస్థితులన్నీ అలావస్తే నీవేం చేస్తావు! మన రోజులు బాగాలేవు అమ్మా...నీ తప్పేంవుంది తల్లీ.... దోషమేమన్నా వుంటే అది నాది.... ఆ తర్వాత... మనల్ని పుట్టించిన దేవుడిది.... కూతురు తల ప్రేమగా నిమురుతూ కన్నీళ్ళమధ్య అన్నాడు రామ్మూర్తి.

లక్ష్మి కళ్ళు మిల మిల లాడాయి.... "నిజంగా నే చేసింది తప్పు కాదా నన్నా...." అంది అమాయకంగా.

"తప్పుకాదని నీవైనా అను నాన్నా.... నామీద కోపంలేదని అను నాన్నా ..." అంటూంది.

"లేదమ్మా.... చూడు తల్లీ.... నిన్ను ఏ క్రూరజంతువో వెంటాడి

తరుముకొస్తూ చంపాలని చూస్తుంటే నీవేం చేస్తావు ! దాని బారినుంచి తప్పించుకోడానికి ఓపి కున్నంత వరకు పరిగెడ్తావు.... ఏదో విధంగా తప్పించుకోడానికి ప్రయత్నిస్తావు.... ఆఖర్న ఏ ప్రయత్నమూ లాభంలేదని తెల్సినా చివరి క్షణంవరకు వంటరిగా ఎదురొడ్డి, పోరాడాలని ప్రయత్నిస్తావు గానీ ....ఎలాగో చస్తాం అని చేతులు ముడుచుకు ఆహుతి అవవు గదా !.... అలాగే యీ ఆకలి.... వాటిని మించిన క్రూరాతి క్రూరమైనది తల్లీ !.... ఆకలిని జయించినవాడు మనిషికాడు.... యీ ఆకలి తీర్చుకోడం కోసం మానవుడు పడరాని పాట్లు పడతాడు !.... దీని బారినుంచి తప్పించుకోడానికి ఎన్ని మార్గాలు అన్వేషించాలో అన్నీ అన్వేషిస్తాడు. ఆ బాధ తీర్చుకోడంకోసం మనిషి ఎంత హీనానికి, ఎంత నీచానికైనా దిగజారుతాడు.... మహామహులే జయించలేక పోయిన ఈ ఆకలిని నీవు.... నీలాంటి వారు ఎలా జయించగలరు !.... నీవేం చేస్తావు.... దీని బారినించి తప్పించుకోడానికి నీకు చాతనయిన ఉపాయం వెదికావు అంతే తల్లీ.... అంతకంటె నీవు చేసిన నేరం ఏంలేదు.... రామ్మూర్తి దృఢంగా అన్నాడు.

"నాన్నా ?" అంది లక్ష్మి సంతోషంగా.

"లే అమ్మా.... ఇంక ఏడవకు.... లోపలికెళ్ళి భోజనం చెయ్యి...."

నాన్నా.... అమ్మ అన్నం తినలేదునాన్నా.... దీనంగాఅంది రామ్మూర్తి గాఢంగా నిట్టూర్చాడు కూతుర్ని ఒప్పించినంత తేలిగ్గా భార్యని నమ్మించలేనని అతనికి తెలుసు ! శుష్కహాసంచేసి "దాని పేగులు ఆకలితో మలమలమాడి ఏనాడో ఎండి పోయాయి.... దానికి ఆకలుండదు తల్లీ.... నీ వెళ్ళి తిను.... పద.... అన్నాడు రామ్మూర్తి కూతుర్ని లేవదీసి ఇంట్లోకి పంపిస్తూ.

చాలాసేపు గడిచాక ఇంట్లోకి వెళ్ళి పడుకున్నాడు రామ్మూర్తి. కూతురు చేసిన పని తప్పుకాదని చెప్పడం తప్పా రైటా అన్న మీమాంసలో ఆ రాత్రి రామ్మూర్తికి నిద్రపట్టలేదు.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 1972)